నమస్తే తెలంగాణ





# ఐపీవోకి లలితా జ్యువెల్లరీ




న్యూఢిల్లీ, జూన్ 9: ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ లలితా జ్యువెల్లరీ..స్టాక్ మార్కెట్లో అడుగుపెట్టడానికి సిద్ధమైంది. ఇందుకు సంబంధించి మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తు చేసుకున్నది. ఈ వాటాల విక్రయం ద్వారా గరిష్ఠంగా రూ.1,700 కోట్ల నిధులను సమీకరించాలని యోచిస్తున్నది. దీంట్లో తాజా షేర్లను జారీ చేయడం ద్వారా రూ.1,200 కోట్లు, కంపెనీ సీఎండీ కిరణ్ కుమార్ జైన్‌కు చెందిన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో విక్రయించడం ద్వారా మరో రూ.500 కోట్లను సేకరించాలని నిర్ణయించింది. ఈ విషయం సెబీకి సమర్పించిన డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్‌పెక్టస్(డీఆర్‌హెచ్‌పీ)లో వెల్లడించింది. అర్హత కలిగిన ఉద్యోగులకు రాయితీతో కూడిన షేర్లను కేటాయించనున్నది సంస్థ. ఈ వాటాల విక్రయంతో వచ్చిన నిధుల్లో రూ.1,014.50 కోట్లను నూతన స్టోర్లను ఏర్పాటు చేయడానికి, కార్పొరేట్ అవసరాల నిమిత్తం వినియోగించనున్నట్టు ప్రకటించింది. 1985లో చెన్నైలో తన తొలి స్టోర్‌ను ప్రారంభించిన సంస్థ..ప్రస్తుతం తన స్టోర్ల సంఖ్యను 56కి పెంచుకున్నది. వీటిలో ఆంధ్రప్రదేశ్‌లో 22, తమిళనాడులో 20, కేరళలో ఏడు, తెలంగాణలో ఆరు, పుదుచ్చేరిలో ఒక్క స్టోర్‌ను నిర్వహిస్తున్నది. డిసెంబర్, 2024తో ముగిసిన తొమ్మిది నెలల కాలానికిగా సంస్థ రూ.12,594.67 కోట్ల ఆదాయంపై రూ.262.33 కోట్ల నికర లాభాన్ని గడించింది.

## 13 నుండి 'స్టైల్ తత్వ'

అమీర్‌పేట్, జూన్ 9 : ఎఫ్ఐసీసీఐ లేడీస్ ఆర్గనైజేషన్(ఎఫ్ఎల్ఓ) హైదరాబాద్ చాప్టర్ నిర్వహిస్తున్న 'స్టైల్ తత్వ' ఐదో ఎడిషన్ ఈ నెల 13, 14 తేదీల్లో హైటెక్స్‌లోని హాల్ 2లో జరగనుంది. సిగ్నేచర్ ఫ్యాషన్, లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌కు సంబంధించిన వివరాలను సోమవారం ఎఫ్ఎల్‌వో హైదరాబాద్ అధ్యక్షురాలు ప్రతిభా కుందా వివరించారు. ఈ రెండు రోజుల ఎగ్జిబిషన్‌లో దేశవ్యాప్తంగా 205 మంది పాల్గొంటున్నారని, వీరిలో ఫ్యాషన్, డెకర్, హ్యాండ్‌లూమ్, ఆభరణాలు, హోమ్ లీవింగ్, కళాత్మక ఉత్పత్తుల విభాగాల్లో విస్తృత శ్రేణి ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు. 10 వేల మందికి పైగా సందర్శకులు ఈ ఎగ్జిబిషన్లో తిలకించేందుకు వస్తారని ఆశిస్తున్నట్టు తెలిపారు.

## బీమా సంస్థల రికార్డు

న్యూఢిల్లీ, జూన్ 9: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో జీవిత బీమా సంస్థలు రికార్డు స్థాయిలో నూతన బిజినెస్ ప్రీమియంను వసూళ్లు చేశాయి. ఏప్రిల్, మే నెలల్లో జీవిత బీమా సంస్థలు 10.8 శాతం మేర నూతన బిజినెస్ ప్రీమియం వసూళ్లలో వృద్ధిని సాధించాయి. లైఫ్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఒక మే నెలలోనే 12.6 శాతం వృద్ధిని నమోదు చేసుకోవడం విశేషం. దీంతో గత నెలలో నూతన బిజినెస్ ప్రీమియం ఆదాయం రూ.27,034 కోట్ల నుంచి రూ.30,463 కోట్లకు పెరిగాయి. మొత్తం ప్రీమియం వసూళ్లు రూ.47,293 కోట్ల నుంచి రూ.52,427 కోట్లకు చేరుకున్నాయి.

# దిగొస్తున్నాయ్..



### ఆర్‌ఆర్‌ఎల్‌ఆర్, ఎంసీఎల్‌ఆర్‌లకు కోత పెడుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకర్లు

### 10 నుంచి 50 బేసిస్ పాయింట్లదాకా తగ్గింపులు దిగుతున్న లోన్ టెన్యూర్, ఈఎంఐల భారం

న్యూఢిల్లీ, జూన్ 9: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇటీవలి ద్రవ్యసమీక్షలో రెపోరేటును అర శాతం కోత పెట్టిన నేపథ్యంలో ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులూ తమ రుణాలపై వడ్డీరేట్లను తగ్గిస్తున్నాయి. గత వారం జరిగిన ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో రెపోను ఆర్బీఐ 50 బేసిస్ పాయింట్లు తగ్గించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా, యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్‌లు రెపో లింక్డ్ లెండింగ్ రేటు (ఆర్‌ఆర్‌ఎల్‌ఆర్) ఆధారిత రుణాలపై, మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్‌ఆర్) ఆధారిత లోన్లపై వసూలు చేస్తున్న వడ్డీరేట్లకు 10 నుంచి 50 బేసిస్ పాయింట్లదాకా కత్తెర వేశాయి.

### బ్యాంక్ ఆఫ్ బరోడా

బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) తమ బెంచ్ మార్క్ లెండింగ్ రేటు ఆర్‌ఆర్‌ఎల్‌ఆర్‌ను 50 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. తగ్గిన వడ్డీరేట్లు ఈ నెల 7 నుంచే వర్తిస్తాయని ఈ ప్రభుత్వ రంగ బ్యాంక్ తెలిపింది. ఆర్‌ఆర్‌ఎల్‌ఆర్ అనుసంధానంగా ఈ బ్యాంక్‌లో లోన్లు తీసుకున్న రుణగ్రహీతలందరికీ ప్రయోజనం చేకూరుతుంది. కాగా, ప్రస్తుతం బీవోబీ ఆర్‌ఆర్‌ఎల్‌ఆర్ 8.15 శాతంతో మొదలవుతున్నది.

### హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

ప్రైవేట్ రంగ బ్యాంక్ హెచ్‌డీఎఫ్‌సీ ఎంసీఎల్‌ఆర్ అన్ని కాలపరిమితులపై 10 బేసిస్ పాయింట్లు తగ్గింది. ఈ నెల 7 నుంచే తగ్గిన వడ్డీరేటు అమల్లోకి వచ్చింది. దీంతో ఎంసీఎల్‌ఆర్ ఆధారంగా రుణాలు తీసుకున్న రుణగ్రహీతలకు ఈ నిర్ణయం లాభిస్తుంది. కాగా, ప్రస్తుతం ఓవర్‌నైట్, నెల ఎంసీఎల్‌ఆర్ 8.90 శాతంగా ఉన్నాయి. 3 నెలలది 8.95 శాతానికి, 6 నెలలు, ఏడాది టెన్యూర్ 9.05 శాతంగా ఉన్నాయి. రెండేండ్లు, మూడేండ్లు టెన్యూర్స్‌పై వడ్డీరేటు 9.10 శాతంగా ఉన్నది. ఇదిలావుంటే ఆర్‌ఆర్‌ఎల్‌ఆర్‌నూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 50 బేసిస్ పాయింట్లు తగ్గించే అవకాశాలున్నాయి. దీని ఆధారంగా రుణాలు తీసుకున్నవారికి వచ్చే నెల నుంచి ఈ లాభం అందనున్నట్టు తెలుస్తున్నది.

### పంజాబ్ నేషనల్ బ్యాంక్

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ఆర్‌ఆర్‌ఎల్‌ఆర్ 50 బేసిస్ పాయింట్లదాకా తగ్గింది. సోమవారం నుంచే ఇది అమల్లోకి వచ్చింది. దీంతో గృహ రుణాలపై వడ్డీరేటు 7.45 శాతం నుంచి మొదలవుతుండగా, వాహన రుణాలపై 7.80 శాతం నుంచి ప్రారంభమవుతున్నది.

### యూకో బ్యాంక్

అన్ని రకాల టెన్యూర్స్‌పై యూకో బ్యాంక్ ఎంసీఎల్‌ఆర్ తగ్గింది. తగ్గిన వడ్డీరేట్లు మంగళవారం నుంచి అమల్లోకి వస్తాయని ఈ ప్రభుత్వ రంగ బ్యాంక్ ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. నెల ఎంసీఎల్‌ఆర్ 8.35 శాతానికి, ఓవర్‌నైట్ 8.15 శాతానికి, 3 నెలలు 8.50 శాతానికి, 6 నెలలు 8.8 శాతానికి, ఏడాది ఎంసీఎల్‌ఆర్ 9 శాతానికి దిగొస్తున్నాయి. అయితే సోమవారం నుంచే ఆర్‌ఆర్‌ఎల్‌ఆర్‌ను 50 బేసిస్ పాయింట్లు తగ్గించినట్టు బ్యాంక్ వెల్లడించింది. ప్రస్తుతం ఇది 8.30 శాతంగా ఉన్నది.

### బ్యాంక్ ఆఫ్ ఇండియా

బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) ఆర్‌ఆర్‌ఎల్‌ఆర్‌ను 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ప్రస్తుతం ఈ వడ్డీరేటు 8.35 శాతంతో మొదలవుతున్నది. తగ్గించిన వడ్డీరేటు ఈ నెల 6 నుంచే అమల్లోకి వచ్చిందని ఈ ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ తెలిపింది.

### కరూర్ వైశ్యా బ్యాంక్

6 నెలల ఎంసీఎల్‌ఆర్‌ను 10 బేసిస్ పాయింట్లు, ఏడాది ఎంసీఎల్‌ఆర్‌ను 20 బేసిస్ పాయింట్లు కోతపెట్టి 9.80 శాతానికి తీసుకొచ్చింది ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ సంస్థ కరూర్ వైశ్యా బ్యాంక్. కొత్త వడ్డీరేట్లు ఈ నెల 7 నుంచే అమల్లోకి వచ్చాయి.

### ఆర్‌ఆర్‌ఎల్‌ఆర్ అంటే?

*రెపో లింక్డ్ లెండింగ్ రేటు (ఆర్‌ఆర్‌ఎల్‌ఆర్) ఆర్బీఐ రెపోరేటు ఆధారంగా ఉంటుంది. రిజర్వ్ బ్యాంక్ రెపోరేటును తగ్గిస్తే ఇది తగ్గుతుంది. పెంచితే పెరుగుతుంది. ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేట్ల (ఈబీఎల్‌ఆర్)లో ఆర్‌ఆర్‌ఎల్‌ఆర్ కూడా ఒకటి.*

### ఎంసీఎల్‌ఆర్ అంటే?

*మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్‌ఆర్)ను ఆర్బీఐ మార్గదర్శకాలను అనుసరించి బ్యాంకులే నిర్ణయిస్తాయి. దీన్ని ఇంటర్నల్ బెంచ్ మార్క్ లెండింగ్ రేటు (ఐబీఎల్‌ఆర్)గా కూడా పరిగణిస్తారు. బ్యాంక్ ఆర్థిక పరిస్థితి, అందుబాటులో ఉన్న నిధులు, వాటికయ్యే ఖర్చులపై ఈ వడ్డీరేటు ఆధారపడి ఉంటుంది.*

## క్వాంటమ్ ఎనర్జీ ప్లాంట్ విస్తరణ

హైదరాబాద్, జూన్ 9: హైదరాబాద్‌కు చెందిన ఈవీ స్టార్టప్ క్వాంటమ్ ఎనర్జీ లిమిటెడ్ తన ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచింది. నగరానికి సమీపంలోని మహేశ్వరం వద్ద ఉన్న ప్లాంట్ కెపాసిటీని 2 లక్షల యూనిట్లకు పెంచుకున్నది. దేశీయంగా కంపెనీకి చెందిన ఈవీలకు డిమాండ్ అధికంగా ఉండటంతో 2.4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నెలకొల్పిన ఈ యూనిట్ సామర్థ్యం పెంచడంతో మరింత మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని కంపెనీ ఎండీ చక్రవర్తి చుక్కపల్లి తెలిపారు. ప్రస్తుతం సంస్థ ప్లాజ్మా, మిలాన్, బిజినెస్ పేర్లతో పలు మాడళ్లను విక్రయిస్తున్నది.

## షిప్‌రాకెట్ డార్క్ స్టోర్

హైదరాబాద్, జూన్ 9: దేశంలో అతిపెద్ద ఈ-కామర్స్ సంస్థల్లో ఒకటైన షిప్‌రాకెట్.. హైదరాబాద్‌లో డార్క్ స్కోర్‌ను ఏర్పాటు చేయబోతున్నది. కస్టమర్లు బుకింగ్ చేసుకున్న వస్తువులను వేగవంతంగా అందించాలనే ఉద్దేశంతో ఇప్పటికే న్యూఢిల్లీ, బెంగళూరు, ముంబైలలో ఈ డార్క్ స్టోర్లను ఏర్పాటు చేయగా..తాజాగా త్వరలో హైదరాబాద్‌తోపాటు చెన్నై, మిగతా నగరాల్లో నెలకొల్పబోతున్నట్లు కంపెనీ సీఈవో అతుల్ మెహతా తెలిపారు. తెలంగాణతోపాటు ఏపీల్లో 18 వేల విక్రయదారులకు సంబంధించిన ఉత్పత్తులను అందుబాటులోవుంచినట్టు చెప్పారు.

## హైదరాబాద్‌లో హైలాండ్ నూతన ఆఫీస్

హైదరాబాద్, జూన్ 9: అమెరికాకు చెందిన టెక్నాలజీ సేవల సంస్థ హైలాండ్..భారత్ తన తొలి కార్యాలయాన్ని హైదరాబాద్‌లో సోమవారం ప్రారంభించింది. అంతర్జాతీయ వ్యాపార విస్తరణలో భాగంగా నగరంలో నెలకొల్పిన ఈ నూతన సెంటర్‌ను అమెరికా కౌన్సిల్ జనరల్ ఫర్ హైదరాబాద్ జెన్నిఫర్ లార్సన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హైలాండ్ సీటీవో టిం మెకింటైర్ మాట్లాడుతూ..హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి టెక్నాలజీ ఎకోసిస్టాన్ని నెలకొల్పినట్టు చెప్పారు.



# నాలుగో రోజూ లాభాల్లో సూచీలు

### సెన్సెక్స్ 255, నిఫ్టీ 100 పాయింట్ల లాభం

ముంబై, జూన్ 9: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజూ లాభాల్లో ముగిశాయి. రిజర్వుబ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించడంతో బ్యాంకింగ్, ఆర్థిక రంగ షేర్లలో క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు కూడా మార్కెట్లను ముందుకు నడిపించాయి. ఇంట్రాడేలో 500 పాయింట్ల వరకు లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 256.22 పాయింట్లు అందుకొని 82,45.21 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 100.15 పాయింట్లు ఎగబాకి 25,103.20 వద్ద స్థిరపడింది. గడిచిన నాలుగు రోజుల్లో సెన్సెక్స్ 1,707 పాయింట్లు లేదా 2 శాతం, నిఫ్టీ 560 పాయింట్లు లేదా 2.27 శాతం చొప్పున పెరిగాయి. ప్రతీకార సుంకాలపై అమెరికా-చైనా దేశాల మధ్య మరోసారి చర్చలు జరుగుతుండటం మార్కెట్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచింది. గడిచిన వారంలో ఆర్బీఐ కీలక వడ్డీరేట్లను అర శాతం తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం మదుపరుల్లో ఉత్సాహాన్ని ఇచ్చిందని, ముఖ్యంగా ఎనర్జీ, ఐటీ, ఆర్థిక రంగ షేర్లు కదంతొక్కాయని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి.

- కొటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, ఇండస్‌ఇండ్, మారుతి, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎన్‌టీపీసీ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- కానీ, ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టపోయాయి.

# మారని మైక్రోఫైనాన్స్ సంస్థల తీరు

### అధిక వడ్డీరేట్లు, కఠిన రికవరీలు ఆగట్లేదు: ఆర్బీఐ డీజీ ఎం రాజేశ్వర్ రావు

ముంబై, జూన్ 9: సూక్ష్మ రుణ సంస్థల్లో (మైక్రోఫైనాన్స్ కంపెనీలు) అధిక వడ్డీరేట్లు, బాకీల వసూళ్లకు అవలంబిస్తున్న కఠిన చర్యలు ఆగట్లేదని, వీటివల్లే మైక్రోఫైనాన్స్ రంగం ఇబ్బందుల్లో పడుతున్నదని ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ల (డీజీ)లో ఒకరైన ఎం రాజేశ్వర్ రావు అన్నారు. ఇటీవల జరిగిన హెచ్ఎస్‌బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఫైనాన్షియల్ ఇంక్లూజన్‌లో మైక్రోఫైనాన్స్ కీలకపాత్ర పోషిస్తున్నదన్నారు. అయినప్పటికీ మైక్రోఫైనాన్స్ కంపెనీల అభ్యంతరకర తీరు మారట్లేదన్నారు. నిజానికి మైక్రోఫైనాన్స్ కంపెనీలకు నిధులు తక్కువ వడ్డీకి, సులువుగా లభ్యమవుతున్నా.. రుణాలపై అధిక వడ్డీరేట్లు వసూలు చేస్తున్నారని, రుణగ్రహీతలపై మితిమీరిన భారం మోపుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఇందుకు ఎన్నో ఘటనలు సాక్ష్యంగా ఉన్నాయన్న ఆయన.. కొన్ని మైక్రోఫైనాన్స్ సంస్థల అకృత్యాలకు అడ్డుకట్ట పడాల్సి ఉన్నదని వ్యాఖ్యానించారు. వెనుకబడిన ఆదాయ వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ఉండాల్సిన మైక్రోఫైనాన్స్ కంపెనీలు.. ధనార్జనే లక్ష్యంగా ముందుకెళ్తుండటం విచారకరమని పేర్కొన్నారు. ఇక బీమా పాలసీలనూ విక్రయిస్తున్నారన్నదానిపై స్పందిస్తూ ఆర్బీఐ దీనికి సంబంధించి తగు మార్గదర్శకాలను విడుదల చేయాలని చూస్తున్నట్టు చెప్పారు.



# గ్రానైట్‌రాయి మీద పడి లారీడ్రైవర్ మృతి

### సడన్ బ్రేక్ వేసిన ముందులారీ డ్రైవర్.., తొర్రూరు ఫతేపురం స్టేజీ వద్ద ప్రమాదం



బాలరాజు(ఫైల్)

తొర్రూరు, జూన్ 9: ముందు వెళ్తున్న లారీ సడన్ బ్రేక్ వేయగా వెనుక గ్రానైట్ రాళ్ల లోడ్‌తో వస్తున్న లారీ డ్రైవర్ కూడా సడన్ బ్రేక్ వేయడంతో ఒక రాయి వచ్చి క్యాబిన్ మీద పడి రంగారెడ్డి జిల్లాకు చెందిన అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం ఫతేపురం స్టేజీ సమీపంలో సోమవారం ఉదయం జరిగింది. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం ముంచెర్ల గ్రామానికి చెందిన దేరుంగుల బాలరాజు (52) కరీంనగర్ నుంచి కాకినాడకు గ్రానైట్‌రాళ్ల లోడు లారీ డ్రైవ్ చేస్తూ ఖమ్మం-వరంగల్ హైవేపై తొర్రూరు మీదుగా వెళ్తున్నాడు. ఫతేపురం స్టేజీ వద్ద ముందు వెళ్తున్న సివిల్ సప్లై శాఖకు చెందిన ధాన్యం బస్తాల లారీ సడన్ బ్రేక్ వేయగా వెనుక గ్రానైట్ లారీ డ్రైవ్ చేస్తున్న బాలరాజు కూడా ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో భారీ గ్రానైట్ రాయి ముందుకు వచ్చి పడడంతో డ్రైవింగ్ క్యాబిన్ నుజ్జునుజ్జయ్యింది. దీంతో బాలరాజు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న తొర్రూరు పోలీసులు చేరుకుని, నాలుగు గంటల పాటు శ్రమించి క్రేన్ సాయంతో గ్రానైట్‌రాయి పక్కకు జరిపి క్యాబిన్‌లో ఇరుక్కున్న మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం కోసం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య అంజమ్మ, కుమారుడు శివ(21) ఉన్నారు. భార్య అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



జయ్యారం పెద్దచెరువుకు పడిన గండి



పెద్ద చెరువులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కట్ట

# చెరువు చెదిరె.. రైతు గుండె చెరువాయె

- మరమ్మతుకు నోచుకోని తటాకాలు
- ఈసారి చెరువుల కింద పంట పండేటట్లు లేదని అన్నదాతల ఆవేదన

చిన్నగూడూరు, జూన్ 9 : గతేడాది కురిసిన భారీ వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాల్లో గండ్లు పడి, కట్టలు తెగిన చెరువులకు మరమ్మతులు చేయకపోడంతో ఈయేడు వాటి కింద పంట లు పండేటట్లు కనిపించడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షాలకు వచ్చిన నీరు వచ్చి నట్లే పోతూ చెరువులన్నీ ఖాళీగా కనిపిస్తున్నాయని, గత ప్రభుత్వ హయాంలో రెండు పంటలు పండిన భూములు నేడు బీడుగా మారాయని వాపోతున్నారు. చెరువులు నిండకపోతే రైతులు, వ్యవసాయ కూలీలకు ఉపాధి దొరకక కరువుతో మళ్లీ పట్టణాలకు వలస పోయే పరిస్థితులు ఎదురవుతాయని చెబుతున్నారు. జయ్యారం పెద్ద చెరువు, బాలసముద్రం చెరువు, విస్సంపల్లి కొత్త చెరువు, గుండంరాజు పల్లి చెరువు, మండల కేంద్రానికి చెందిన పెద్ద చెరువుకు మహబూబాబాద్ మండలం వీఎస్ లక్ష్మీపురం చెరువు నుంచి అలుగు నీరు వచ్చే సొటకుంట కట్ట తెగిపోయింది. దీంతో వీఎస్ లక్ష్మీపురం చెరువు నుంచి వచ్చే వరదనీరు చెరువులోకి రాకుండా జిన్నవాగులో పడి వృథాగా పోతున్నది. జయ్యారం పెద్ద చెరువు కింద 560 ఎకరాలకు నీరందించే చెరువుకు గండిపడింది. తాత్కాలికంగా అడ్డుకట్ట వేసినా నీరు నిలిచే స్థితి లేదని రైతులు తెలుపుతున్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు చొరవ చూపి ఇప్పటికైనా చెరువు కట్టలకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

#### రైతులను ఆదుకోవాలి



గత సంవత్సరం కురిసిన వర్షాలకు చెరువులకు గండ్లుపడి పంట పొలాల్లో ఇసుక మేటలు పెట్టి తీవ్రంగా నష్టపోయాం. అధికారులు చెరువు కట్టల మరమ్మతులు ఇప్పటికీ మొదలు పెట్టలేదు. వర్షాకాలం వచ్చింది. నారు పోసేందుకు సిద్ధమవుతున్నా చెరువులో చుక్క నీరులేదు. చెరువు నిండేటట్లు కనిపించట్లే. ఈయేడు కూడా చెరువుల కింద పంటలు పండేటట్టు లేదు. అధికారులు వెంట నే మరమ్మతు పనులు చేపట్టాలి.

– చెవుల రణధీర్, రైతు, జయ్యారం, చిన్నగూడూరు



మడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్లు

## అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్లు

తొర్రూరు, జూన్ 9 : తొర్రూరు మండలం మడిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేసిన కోడిగుడ్లు కుళ్లిపోవడంపై లబ్ధిదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి నెల ఒకటో తేదీన పంపిణీ చేసే గుడ్లలో ఈ సారి సుమారు 10 నుంచి 12 గుడ్లు కుళ్లిపోయినట్లు వారు తెలిపారు. కొండేటి శిరీష, కొండేటి భవానికి కలిపి మొత్తం 45 కోడిగుడ్లు ఒకటో తేదీన పంపిణీ చేయగా, అందులో సుమారు 12 పాడైపోయాయని తెలిపారు. సోమవారం గుడ్లను ఉడకబెట్టిన సమయంలో నల్లగా మారి దుర్వాసన రావడంతో కుళ్లిపోయినట్లు గుర్తించామని తెలిపారు. నాణ్యత లేని గుడ్లు పం పిణీ చేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడొద్దని, అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నారు.

### జూలై 31లోగా దరఖాస్తు చేసుకోవాలి

హనుమకొండ చౌరస్తా, జూన్ 9 : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎస్సీ న్యాయవాద పట్టభద్రులు జిల్లా ప్రభు త్వ న్యాయవాది వద్ద వృత్తిలో శిక్షణ పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శ్రీలత తెలిపారు. తండ్రి ఆదాయం రూ.2లక్షలు మించకుండా, ఇంతకుముందు శిక్షణ పొం దని వారు, ఏ ఇతర పదువులు పొందని వారు మాత్రమే అర్హులని, ఉమ్మడి వరంగల్ జిల్లాకు 8 సీట్లు కేటాయించారన్నారు. www.telanganaepass. cgg.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 11 నుంచి జూలై 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# వృద్ధురాలి దారుణ హత్య

- డంబెల్‌తో తలపై మోది హతం.., పుస్తెల తాడు, నగదు అపహరణ
- హంతకుల కోసం గాలిస్తున్న పోలీసులు, ఉలిక్కిపడిన స్తంభంపల్లి



స్వరూప (ఫైల్)

గీసుగొండ, జూన్ 9 : ఓ వృద్ధురాలు దారుణ హత్యకు గురైంది. ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులకు ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని చూసి, ఇంట్లోకి చొరబడి డంబెల్‌తో తలపై మోది హత్య చేసిన ఘటన గ్రేటర్ వరంగల్ 17వ డివిజన్ ఖిలావరంగల్ మండలం స్తంభంపల్లి గ్రామంలో ఆలస్యంగా వెలుగుచూసింది. సీఐ మహేందర్, గ్రామస్తుల కథనం ప్రకారం.. స్తంభంపల్లి గ్రామానికి చెందిన పోచన స్వరూప (70)కు కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ముగ్గరికి పెండ్లిళ్లు జరిగాయి. కొడుకు రమేశ్ హనుమకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. తల్లి, భార్యాపిల్లలతో కలిసి స్తంభంపల్లిలో ఉంటూ రోజూ ఉద్యోగం కోసం హనుమకొండకు వెళ్లి ఇంటికి వచ్చేవాడు. వచ్చిపోయేందుకు ఇబ్బందవుతున్నదని మూడు నెలల క్రితం భార్యాపిల్లలతో కలిసి రమేశ్ హనుమకొండలో కిరాయి ఇంట్లో ఉంటున్నాడు. తల్లి స్వరూప స్తంభంపల్లిలోనే ఉంటున్నది. ఈ నెల 4న స్వరూప ములుగులో ఉంటున్న తన చిన్నకుమార్తె వద్దకు వెళ్లి తెల్లవారి తిరిగి ఇంటికి చేరుకున్నది. 8న ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో ఇంటి ఎదుట, ఇంట్లో లైట్లు ఆఫ్ చేసి ఉండడంతో పక్క ఇంట్లో కిరాయికి ఉంటున్న మరిగిద్దె సుజాత ఇంట్లో వెళ్లి లైట్‌ఆన్ చేయగా స్వరూప చిల్డ్రన్స్ బెడ్‌రూమ్‌లో రక్తపు మడుగులో చనిపోయి కనిపించింది. వెంటనే కేకలు వేస్తూ బయటకు వచ్చి స్వరూప కుమారుడు రమేశ్‌కు ఫోన్ చేసి విషయం చెప్పింది. అతడు 40 నిమిషాల వ్యవధిలోనే స్తంభంపల్లికి చేరుకున్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు డంబెల్‌తో తలపై మోది హతమార్చి ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల పుస్తెలతాడు, తులం కమ్మలు వాటి విలువ అపహరించారు. వాటి విలువ సుమారు రూ.2.10లక్షల పది వేల ఉంటుందని, బీరువాలో ఉన్న రూ.10 వేల నగదును సైతం అపహరించినట్లు బాధితులు తెలిపారు. కుమారుడు రమేశ్ ఫిర్యాద మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని హతమార్చిన ఘటన తెలియడంతో ఒక్కసారిగా స్తంభంపల్లి ఉలిక్కిపడింది. ఆదివారం ఘటన తెలిసిన వెంటనే అర్ధరాత్రి ఈస్టుజోన్ డీసీపీ అంకిత్‌కుమార్ ఎసీపీ వెంకటేశ్, సీఐ మహేందర్ ఘటనా స్థలానికి చేరుకొని హత్య జరిగిన ఇంటిని పరిశీలించారు.

# నిట్‌లో ఓపెన్ హౌస్

హనుమకొండ చౌరస్తా, జూన్ 9 : నిట్‌లో విద్యాప్రవేశాల సందర్భంగా అభ్యర్థులు, వారి తల్లిదండ్రులతో ప్రత్యక్షంగా సంప్రదించేందుకు ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి సంస్థ చరిత్ర, విద్యా ప్రావీణ్యం, పరిశోధనా కార్యక్రమాలు, వసతులు, విద్యార్థి కేంద్రిత దృష్టికోణం గురించి అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ శరత్‌బాబు, డీన్ (అకాడమిక్), జోసా కౌన్సెలింగ్ ప్రక్రియ గురించి విశదీకరించారు. ఉమామహేశ్ చైర్‌పర్సన్ (అడ్మిషన్లు) అభ్యర్థులు, తల్లిదండ్రుల వ్యక్తిగత సందేహాలకు సమాధామిచ్చారు. అసోసియేట్ డీన్ (అడ్మిషన్లు) రవిచంద్ర ఓపెన్‌హౌస్ ఒక ఆత్మీయ వేదికగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సుమారు 200 మంది ప్రత్యక్షంగా, అనేకమంది లైవ్ స్ట్రీమింగ్ ద్వారా పాల్గొన్నారు. సుమారు 2 గంటల పాటు ప్రశ్నలు–సమాధానాల సెషన్ నిర్వహించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

**ముగిసిన అభివృద్ధి కార్యక్రమం..**

నిట్‌లోని బయోటెక్నాలజీ విభాగం, ట్రైనింగ్ అండ్ లెర్నింగ్ కేంద్రం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఐదు రోజుల ఆన్‌లైన్ ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమం ముగిసింది. 'బయో ఇంధనాలు, బయోరిఫైనరీల్లో అభివృద్ధి, ఆవిష్కరణలు , భవిష్యత్తుకు స్థిరమైన పరిష్కారం' అనే థీమ్‌తో నిర్వహించారు. దేశవ్యాప్తంగా వివిధ విద్యాసంస్థల నుం చి 80 మందిపైగా అధ్యాపకులు, పరిశోధకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రొఫెసర్ శిరీష్ (ఆర్‌అండ్‌డీ డీన్), రామరాజు (బయోటెక్నాలజీ విభాగాధిపతి), ఒంకార్ ప్రారంభించారు. కీ నోట్ ప్రసంగాన్ని ప్రొఫెసర్ మకరంద మాధవ్ ఘంగ్రేకర్, డైరెక్టర్–నిట్ పుదుచ్చేరి, ప్రొఫెసర్ – ఐఐటీ ఖరగ్‌పూర్ అందించారు. బయో రిఫైనరీ అభివృద్ధిలో ఎదురయ్యే సవాళ్లు, సహకార అవకాశాలపై ప్యానల్ చర్చ నిర్వహించారు. ఆశిశ్ ప్రభు, సూరజ్‌భాన్ సేవ్దా (బయో టెక్నాలజీ విభాగం) సమన్వయం చేశారు.

# దండం పెడ్తా సార్.. మా వడ్లు కొనండి

- నర్సంపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట వడ్ల లోడ్‌తో రైతు నిరసన
- 15రోజులుగా మిల్లుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం
- పోలీసుల జోక్యంతో ఆందోళన విరమణ



నర్సంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతు భద్రు

నర్సంపేట, జూన్ 9 : 'ఎమ్మెల్యే సార్.. దండం పెడ్తా.. మా వడ్లు మిల్లర్లు దించుకునేలా చూడండి' అంటూ ఓ రైతు నర్సంపేట పట్టణంలో నిరసన వ్యక్తం చేశారు. 15 రోజులుగా మిల్లుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకపోవడం, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేకపోవడంతో ఏకంగా నర్సంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట వడ్ల లోడ్‌తో రైతు సోమవారం నిరసనకు దిగాడు. వివరాల్లోకి వెళితే.. వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్‌లోని చెన్నారావుపేట మండలం జోజి పేటతండాకు చెందిన లావుడ్యా భద్రు తనకు ఉన్న రెండున్నర ఎకరాలతోపాటు మరో 15 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశాడు. చేతికొచ్చిన ధాన్యాన్ని 20రోజుల క్రితం ఇదే గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో కొంత ధాన్యాన్ని, చెన్నారావుపేట మండల కేంద్రం సొసైటీ పరిధిలోని కొనుగోలు కేంద్రంలో మరికొంత ధాన్యాన్ని ఉంచాడు. దాదాపు వెయ్యి బస్తాల ధాన్యం కొనుగోలు సెంటర్‌లో ఆరబోశాడు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు కొంత ధాన్యం తడిసి నల్లబారింది. 15రోజుల క్రితం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటాలయ్యాయి. కాంటా అయిన ధాన్యాన్ని నర్సంపేట డివిజన్‌లోని అన్ని మిల్లుల వద్దకు తీసుకెళ్లాడు. ప్రతి రోజూ రూ.3వేల ట్రాక్టర్ కిరాయి పెట్టుకొని కనిపించిన మిల్లులన్నీ తిరిగినా మిల్లర్లు వేర్వేరు కారణాలు చూపి ధాన్యాన్ని దింపుకోలేదన్నారు. మూడు రోజుల క్రితం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి సమస్యను వివరించినట్లు భద్రు తెలిపారు. అయినా ఫలితం లేకపోవడంతో విసిగి వేసారిన రైతు సోమవారం ట్రాక్టర్ లోడ్ ధాన్యాన్ని తీసుకొని నర్సంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి వెళ్లబోయాడు. గేటు మూసి ఉండడంతో ఆఫీస్ ఎదుట వడ్ల లోడ్‌తో రైతు భద్రు, డ్రైవర్ నిరసన చేపట్టారు. మిల్లర్లు ధాన్యాన్ని దింపుకోవడం లేదని, స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని ఆందోళనకు దిగారు. గమనించిన పోలీసులు భద్రుతోపాటు ట్రాక్టర్ వడ్ల లోడ్‌ను క్యాంపు ఆఫీస్ గోడను ఆనుకొని ఉన్న సందులోకి తీసుకెళ్లారు. అక్కడ అరగంట పాటు రైతు పోలీసు అధికారులను వేడుకున్నాడు. రైతుకు నచ్చజెప్పేందుకు పోలీసులు తీవ్ర ప్రయత్నాలు చేపట్టారు. వడ్లు వెంటనే మిల్లర్లు దించుకునేలా తాము చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో రైతు శాంతించాడు. చివరకు పోలీసుల జోక్యంతో రైతు ఆందోళన విరమించారు. అనంతరం ట్రాక్టర్ వడ్ల ధాన్యాన్ని చెన్నారావుపేట మండల కేంద్రంలోని ఏఎంసీకి పోలీసులు తరలించారు.